సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



భక్తుల కోలాహలం

వేములవాడ: రాజన్నను గురువారం భారీగానే భక్తులు దర్శించుకున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు మొక్కులు చెల్లించుకున్నారు.



జిల్లాకు ఇంటర్‌సెప్టర్ వాహనం

సిరిసిల్లక్రైం: జిల్లాకు వచ్చిన ఇంటర్‌సెప్టర్ వాహనాన్ని ఎస్పీ అఖిల్‌మహాజన్ గురువారం ప్రారంభించారు. సిరిసిల్ల, వేములవాడల్లో నిరంతరం గస్తీ ఉంటుందని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం



అఖిల్ మహాజన్
జిల్లా ఎస్పీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని ఎస్పీ అఖిల్‌మహాజన్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మే 2న ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకే ఠాణా దివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మే 2వ తదీ ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను, గ్రామాల్లోని సమస్యలను చట్టపరంగా పరిష్కరించనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టుబడ్డ వాహనాలకు నేడు వేలం



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎక్సైజ్ నేరాల్లో దొరికిన ఎనిమిది ద్విచక్రవాహనాలతోపాటు ఒక టాటాఏసీ ఆటోను వేలం వేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ధరావత్తుగా 50శాతం ముందుగా చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి వేలంపాట ప్రారంభమవుతుందని తెలిపారు.

పట్టాల ఆరోపణపై విచారణ



రుద్రవరంలో విచారణ చేస్తున్న డీపీవో రవీందర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం పునరావాసకాలనీలో అక్రమంగా ఇళ్ల పట్టాలు అందినట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ గురువారం విచారణ చేపట్టారు. పట్టాలు తీసుకున్న వారికి నోటీసులు అందించి, పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. డీపీవో మాట్లాడుతూ ఆర్‌అండ్ఆర్ కాలనీలో 16 పట్టాలు అక్రమంగా తీసుకున్నారని ఆరోపణపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. 16 మంది నుంచి 2006 గెజిట్ ప్రకారం ఆధారాలు సేకరించినట్లు చెప్పారు. విచారణ అనంతరం కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు రాజశేఖర్‌రెడ్డి, రేగుల దేవేందర్, విద్యాసాగర్‌రావు, గుమ్మడి శ్రీనివాస్ గురువారం తెలిపారు. అధ్యక్ష స్థానానికి పిట్టల మనోహర్, పెంట రాజు, ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, గడ్డం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.భానుకృష్ణ, నక్క దివాకర్, జాయింట్ సెక్రెటరీగా జంగం అంజయ్య, తల్లం రాజేంద్రప్రసాద్, లైబ్రరీ సెక్రెటరీగా బి.మహేందర్, జి.మనోహర్, స్పోర్ట్స్ సెక్రెటరీగా అవదూత రజనీకాంత్, రేగుల రాజ్‌కుమార్, కోశాధికారిగా బొజ్జ నరేశ్, బొడ్డు ప్రశాంత్‌కుమార్, సీనియర్ ఈసీ మెంబర్లుగా బి.గంగరాజు, కె.నర్సింగారావు, డి.ప్రవీణ్, నరాల శ్రీనివాస్ బరిలో ఉన్నారు. జూనియర్ ఈసీ మెంబర్లుగా బి.బాలరాజు, పి.నాగరాజు, జి.రమేశ్, మహిళా ప్రతినిధిగా అన్నపూర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

కంటి వెలుగులో 4,375 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలోని 26 ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 4,375 మందికి నేత్రపరీక్షలు చేశారు. ఇందులో 538 మందికి రీడింగ్ అద్దాలను, 566 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 63 రోజులుగా నిర్వహించిన కంటివెలుగు శిబిరాల్లో ఇప్పటి వరకు 2,32,899 మందికి పరీక్షలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 234 మంది సిబ్బంది శిబిరాల్లో పాల్గొన్నారు.

గడ్డే మిగిలింది

- నేలరాలిన వరిగింజలు
- ఖాళీగా కనిపిస్తున్న మామిడిచెట్లు
- వడగండ్లతో అన్నదాతలకు తీవ్ర నష్టం
- ఊడ్చుకుపోయిన గుంటపెల్లిచెరువుతండా
- కన్నీటిపర్యంతమవుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



వరిచేనులో రాలిన పంటను చూసి కంటతడి పెడుతున్న ఈ మహిళా రైతు పేరు మాలోతు అంబి. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపెల్లిచెరువుతండా వాసి. తనకున్న ఆరున్నర ఎకరాలలో వరిపంటను సాగుచేసింది. వారం రోజుల్లో కోతకు సిద్ధమవుతున్న సమయంలోనే వడగండ్ల వాన పంటను తుడిచిపెట్టుకుపోయింది. దీంతో పంటల సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని రెండు రోజు లుగా ఆ కుటుంబం పస్తులుంటుంది.



గింజలు రాలిన పంటను చూసి చేనులోనే తల్లడిల్లుతున్న ఈ రైతు పేరు కాచర్ల రాములు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి గ్రామానికి చెందిన రైతు. రాములు తనకున్న ఆరు ఎకరాలలో వరిపంటను సాగు చేశాడు. వరుణుడు రెండు సీజన్లలో తన వరిపంటను వడగండ్ల రూపంలో తుడిచిపెట్టుకుపోవడంతో 'దేవుడా.. ఎట్లా బతికేదని' రోదిస్తున్నాడు. వరుణుడి విలయతాండవంతో రాములు లాగే జిల్లాలోని రైతాంగం పుట్టెడు దుఃఖంతో ఉన్నారు.



గుంటపల్లిచెరువుతండాలో దెబ్బతిన్న వరిపంట, ఇన్‌సెట్‌లో.. అక్కపల్లిలో నేలవాలిన వరిగింజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వడగండ్ల వాన రైతులకు కడగండ్లే మిగిల్చింది. అకాలంగా కురిసిన రాళ్లవాన అన్నదాతలను నిండా ముంచింది. చేతికొచ్చిన పంట కళ్లముందే నేలపాలైంది. కాతకు వచ్చిన మామిడిచెట్లు మోడువారి కనిపిస్తున్నాయి. చెట్ల కింద రాలిన మామిడికాయలను చూసి రైతులు ఎక్కి..ఎక్కి ఏడుస్తున్నారు. ఈనిన వరిచేనుపై రాళ్ల వాన దాడి చేయగా.. వరిగింజలు రాలిపోయి గడ్డి మాత్రమే మిగిలింది. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో వడగండ్ల వానతో అపార నష్టం ఏర్పడింది. పంటనష్టం పరిశీలనకు వెళ్లిన అధికారులు, ప్రజాప్రతినిధులను చూసిన రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. చెడగొట్టు వాన తమను నిండా ముంచేసిందని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లిచెరువు తండాలో ఎవరిని కదిలించిన కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి. గ్రామంలో దాదాపు వందశాతం పంటనష్టం జరిగింది. ఒక్క వరి గింజ కూడా చేతికొచ్చే పరిస్థితులు లేవు.

కదిలిస్తే కన్నీళ్లే..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల వ్యాప్తంగా పంటలకు రాళ్లవాన తీవ్ర నష్టం చేసింది. వరిపంటకు అపారనష్టం జరుగగా.. మామిడి కాయలు రాలిపోయాయి. ఇల్లంతకుంట, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లో పాక్షికంగా నష్టం జరుగగా, మిగతా పది మండలాల్లో వడగండ్ల వానలు దంచికొట్టాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లిచెరువుతండా, అక్కపల్లి గ్రామాల్లో వందశాతం వరిపంటకు నష్టం వాటిల్లింది. గుంటపల్లిచెరువుతండా గిరిజనులు పంటల పరిశీలనకు వెళ్లిన జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను చూసి ఘొల్లుమన్నారు. ఇప్పటికీ ఆ తండా రైతులు ఆ షాక్ నుంచి తేరుకోవడం లేదు. తమపే ప్రభుత్వం వెంటనే ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి పంట నష్టం ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాలలో..)	రైతులు
కోనరావుపేట	595	720
ముస్తాబాద్	55	30
గంభీరావుపేట	975	683
ఎల్లారెడ్డిపేట	3,704	2,412
తంగళ్లపల్లి	20	18
చందుర్తి	650	890
సిరిసిల్లరూరల్	240	275
వీర్నపల్లి	1090	936
మొత్తం	7,329	5,964

మామిడిపంట నష్టం ఇలా..

మండలం	విస్తీర్ణం	రైతులు
గంభీరావుపేట	32	27
ముస్తాబాద్	5	7
సిరిసిల్లరూరల్	1	2
మొత్తం	38	36

సర్వే చేస్తున్నాం



వడగండ్లతో ఎల్లారెడ్డిపేట మండలంలో అపార నష్టం వాటిల్లింది. గ్రామాలవారీగా పంటనష్టంపై సర్వేలు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టం వివరాలను అంచనా వేస్తున్నాం. గ్రామాల్లో ఏఈవోలను అప్రమత్తం చేసి రైతులతో కలిసి నష్టంపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించాం. పూర్తిస్థాయిలో నష్టం అంచనాలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తాం.

– చాద భూమిరెడ్డి, వ్యవసాయాధికారి

అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో..

జిల్లాలోనే ఎల్లారెడ్డిపేట మండలంలో వడగండ్ల వాన అత్యధిక నష్టాన్ని కలిగించింది. 3,704 ఎకరాలలో చేతికొచ్చే స్థితిలో ఉన్న వరిపంట నేల రాలింది. దీంతో 2,412 మంది రైతులకు గుండె కోతే మిగిలింది. జిల్లా యంత్రాంగం అంతా మండలంలోనే కలియతిరుగుతూ పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7,329 ఎకరాలలో వరిపంట పూర్తిగా ధ్వంసం కాగా.. 5,964 మంది రైతులు నష్టపోయారు. 38 ఎకరాలలోని మామిడితోటలకు నష్టం వాటిల్లగా.. 36 మంది మామిడిరైతులు రోడ్డున పడ్డారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- రేపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే హాల్‌టికెట్లను విడుదల చేశామని, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కానివారు శుక్రవారంలోగా నవోదయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పద్నాలుగు బ్లాకుల పరిధిలో ఏర్పాటు చేసిన 37 పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తామని, 7,730 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్ లేకుండా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని.. అభ్యర్థులంతా ఉదయం 10.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతిలేదని పేర్కొన్నారు.

జేవీవీ రాష్ట్ర స్థాయి వేసవి శిక్షణ శిబిరాలు

బోయినపల్లి(చొప్పదండి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29, 30వ తేదీల్లో మేడ్చల్‌లో రాష్ట్రస్థాయి సమ్మర్‌క్యాంప్ రిసోర్స్‌పర్సన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సంపతి రమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరంలో ప్రతీ జిల్లా నుంచి ఐదుగురు సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్, గణితం, సరదా గణితం, సర్దార్ సైన్స్ అండ్ సైన్స్ టాయ్స్, ఆస్ట్రానమీ, ఒరిగామీ, మ్యాజిక్, మిరాకిల్ ఎక్స్‌పోజర్, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఆసక్తి గల వారు 99595 56367లో సంప్రదించాలని కోరారు.

బోయినపల్లి సెస్ ఏఏఈ బదిలీ

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల సెస్ ఏఏఈ రాకేశ్‌రెడ్డి చందుర్తికి బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. బోయినపల్లి సెస్ ఏఏఈగా సిరిసిల్ల కార్యాలయ కమర్షియల్ విభాగంలో విధులు నిర్వహించే నగేశ్ నియమితులయ్యారు. నగేశ్ గతంలో బోయినపల్లి సెస్ ఏఏఈగా పనిచేశారు.

లక్ష్యసాధనకు భగీరథుడు స్ఫూర్తి

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్
- కలెక్టరేట్‌లో మహర్షి భగీరథ జయంతి



కలెక్టరేట్‌లో మహర్షి భగీరథడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా అధికారులు

సిరిసిల్ల: పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయడంలో మహర్షి భగీరథుడు సమాజానికి స్ఫూర్తి అని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహర్షి భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నీటిని దివి నుంచి భువికి తెచ్చిన మహానీయుడు భగీరథుడు అన్నారు. మహానీయుల జీవిత విశేషాలు ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం వేడుకలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. భగీరథుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించారు. డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, కలెక్టరేట్ ఏవో గంగయ్య, బీసీ అభివృద్ధి అధికారి సంపూర్ణ, కలెక్టరేట్ సెక్షన్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ వైద్యసేవలను మరింత విస్తరించాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు కోరారు. తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ)పై జిల్లా స్థాయి శిబిరాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీపీ, షుగర్, గుండెజబ్బుల వంటి వాటికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యసేవలపై నమ్మకాన్ని పెంచుతూ.. మరింత చురుగ్గా క్షేత్రస్థాయిలో వైద్యసేవలను విస్తరించాలని కోరారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిత, డీడీఎం డాక్టర్ కార్తీక్, తంగళ్లపల్లి పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ, జిల్లాలోని 17 పీహెచ్‌సీల వైద్యులు, ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ.. నీటివేట



ఈ ఫొటోలోని చిన్నారులను చూస్తుంటే అభివృద్ధి ఫలాలు ఇంకా అట్టడుగు స్థాయికి చేరలేదనిస్తోంది. అభివృద్ధిలో దూసుకుపోతున్న మన ప్రాంతంలోనూ నీటికష్టాలు సంచారజీవులను వెంటాడుతూనే ఉన్నాయి. మండుతున్న ఎండల్లో గుక్కెడు నీటి కోసం పిల్లాపాపలతో ఇలా చేతిలో బకెట్లు, క్యాన్లు, బేసిన్ తట్టలతో గేట్‌వాల్వ్ వద్దకు వస్తున్నారు. సిరిసిల్ల శివారులోని ముష్టిపల్లి వద్ద గురువారం సంచారజీవులు మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ లీకేజీ నీటిని ఒడిసి పట్టుకుంటున్నారు. గేట్‌వాల్వ్ ఇనుప కంచె కింద నుంచి పిల్లలను లోపలికి పంపించి లీకేజీ నీటిని బేసిన్ తట్టలో పట్టుకుని మగ్గుతో బకెట్లు, క్యాన్లు నింపుకుంటున్నారు. గేట్‌వాల్వ్ సమీపంలో గుడారాలు వేసుకుని జీవించే సంచార జీవులకు ఈ మిషన్‌భగీరథ లీకేజీ నీరే దిక్కువుతుంది. - సిరిసిల్ల

జీపీఎఫ్ బకాయిలు రూ.28 కోట్లు

- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ గోస
- తొమ్మిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్, పార్టు ఫైనల్ లోన్స్, అడ్వాన్సులు

'భార్యభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులే. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మల్యాల మండలంలో భర్త పనిచేస్తుండగా.. ఆయన భార్య ధర్మారం మండలంలో పనిచేస్తున్నారు. వారి గ్రామంలో భూమి కొనుగోలు కోసం సెప్టెంబర్‌లో క్రయవిక్రయ ఒప్పందం జరిగింది. ఇరువురు జిల్లా పరిషత్‌లో వారి జీపీఎఫ్ ఖాతాల్లో సొంత డబ్బును రూ.15 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలుగా వారికి రావాల్సిన లోన్ రావడం లేదు. దీంతో జెడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.'

'చొప్పదండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. ఆయనకు రావాల్సిన బకాయిల కోసం అక్టోబర్‌లో దరఖాస్తులు సమర్పించారు. నేటికీ పెన్షన్, ఇతరత్రా డబ్బుల కోసం జెడ్పీ జీపీఎఫ్ విభాగంలో వాకబు చేస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు డబ్బులు అందలేదు'.

'గంగాధర మండల కేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆరోగ్య రీత్యా అవసరం ఏర్పడి కొంత మేరకు లోన్ కావాలని దరఖాస్తు సమర్పించారు. ఐదు నెలలు గడుస్తున్నా లోన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు'.

- ఇది ఇలా ఒకరిద్దరి ఉపాధ్యాయుల బాధ కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొమ్మిది నెలలుగా వివిధ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వెతలు
- ఇలా తొమ్మిది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఎందరో జీపీఎఫ్ డబ్బుల కోసం కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.'

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, వరంగల్ అర్బన్, భూపాలపల్లి జిల్లాలోని 71 మండలాల్లో 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు విద్యాశాఖలో పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) విభాగం నుంచి పదవీ విరమణ పొందిన సమయంలో వీరి పెన్షన్ డబ్బులతో పాటు ఇతరత్రా సదుపాయాలు పొందే వీలుంటుంది. పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి సర్వీసును బట్టి తాము దాచుకున్న డబ్బులు అవసరాల కోసం తీసుకోవచ్చు. ఇల్లు రిపేరు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆరోగ్య రీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ విభాగం నుంచి డబ్బులు పొందే వీలుంది. కానీ.. జిల్లా పరిషత్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాము అవసరాల కోసం దాచుకున్న డబ్బుల కోసం వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్‌లోని జీపీఎఫ్ విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గతంలో పలుమార్లు ధర్నాలు నిర్వహించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. తాజాగా ఈ విద్యా సంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ఏటా ఇదే తంతు జరుగుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు.



సిరిసిల్ల జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం

బకాయిలు ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.28 కోట్ల పైబడి ఉంటాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీపీఎఫ్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జీపీఎఫ్ విభాగం సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి వివిధ రకాల బిల్లులు 243 మంది ఉపాధ్యాయుల పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి దాదాపు 28 కోట్ల రూపాయలు చెక్కుల రాసినట్లు చెప్పారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు పంపామని.. ఈ–కుబేర్‌తో జాప్యమవుతోందని.. అది ప్రభుత్వ పరిధిలోని అంశమని సమాధానమిచ్చారు.

పార్ట్ ఫైనల్	రూ.18,99,40,000
ఫైనల్ పేమెంట్స్ (స్వచ్ఛంద పదవీ విరమణ,ఆకస్మికంగా మృతి చెందినవారివి)	రూ.7,40,11,000
అడ్వాన్సులు	రూ.1,60,49,000
రావాల్సిన బకాయిలు మొత్తం రూ. 28 కోట్లు	

పెండింగ్ బిల్లులన్నీ సకాలంలో చెల్లించాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతిచెందిన వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా మానసిక్షోభకు గురిచేయడం తగదు. ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ విభాగం నుంచి అత్యవసర నిమిత్తం డబ్బులు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కాలరాయడం భావ్యం కాదు. తొమ్మిది నెలలుగా 400 మందికిపైగా ఉపాధ్యాయులకు మంజూరై ఉన్న రూ.28 కోట్ల డబ్బులను వెంటనే చెల్లించాలి.

– తూముల తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

భరణి కార్తెలోనే కనిపించిన 'ఆరుద్ర'



కనగర్తిలో కనిపించిన ఆరుద్ర

కోనరావుపేట : ఏటా జూన్‌లో ఆరుద్ర కార్తెలో దర్శనమిచ్చే ఆరుద్ర పురుగు మండలంలోని కనగర్తిలో భరణి కార్తెలోనే కనిపించింది. ఆరుద్ర కనిపిస్తే వర్షాలు బాగా కురుస్తాయని భావించే రైతులు వర్షాలకారణంగా ముందే కనబడి ఉండొచ్చని భావిస్తున్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

వీర్నపల్లి: ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో గురువారం చిన్నపరుపు బండల అడవి ప్రాంతంలో వీర్నపల్లి– ఎల్లారెడ్డిపేట ప్రధాన రహదారి పక్కన పదిమందికి పైగా కూలీలు పనిచేసేందుకు వెళ్లారు. చెట్ల చుట్టూ కుండీలు చేసే క్రమంలో ఒక్కసారిగా తేనేటీగలు వారిపై దాడిచేశాయి. దీంతో వారు అక్కడినుంచి పరుగులు తీశారు. కాగా గాయపడిన వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు పోలీస్ స్పోర్ట్స్ మీట్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ మినీస్టేడియంలో శుక్రవారం పోలీసులకు వార్షిక స్పోర్ట్స్‌మీట్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు క్రీడలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నేడు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

సిరిసిల్ల: సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్నామని సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల రైతులు ఇప్పటికే మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు పోశారని, శుక్రవారం నుంచి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

గీత కార్మికులను విస్మరిస్తోన్న ప్రభుత్వం



మాట్లాడుతున్న వంగ అనిల్ కుమార్ గౌడ్

సిరిసిల్ల అర్బన్ : గీత కార్మికులను ప్రభుత్వం విస్మరిస్తోందని బీజేపీ నాయకుడు వంగ అనిల్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడిన, మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం సకాలంలో చెల్లించాలన్నారు. గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే క్రమంలో ఎంతోమంది గాయాలపాలై, మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు ఎలాంటి నష్టపరిహారం అందడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు రూ.5లక్షలు చెల్లించాలన్నారు. అనంతరం అబ్కారీ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు ఏష సాయిదీప్ గౌడ్, వంగ కృష్ణగౌడ్, గౌడ కులస్తులు ఉన్నారు.

పెన్షన్..టెన్షన్

'ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన విద్యాశాఖలో పనిచేసి ఒకరు పదేళ్ల క్రితం రిటైర్డ్ అయ్యారు. నాలుగేళ్ల క్రితం గుండెపోటు రాగా హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లారు. అత్యవసర పరిస్థితుల్లో బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. అయితే ఈహెచ్‌ఎస్ ద్వారా చేయడానికి నిరాకరించారు. ఫలితంగా అప్పు చేసి డబ్బులు చెల్లించి ఆపరేషన్ చేయించుకున్నాడు. రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుని నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నాడు'.

'సిరిసిల్లకు చెందిన ఓ డెబ్బయి ఏళ్ల ఫ్యామిలీ పెన్షనర్ అనారోగ్యంతో బాధపడుతోంది. బీపీ, షుగర్, థైరాయిడ్, ఆర్థో నొప్పులకు ప్రతీ నెల మందులు వాడాలి. రూ.15వేలు మాత్రమే పెన్షన్ వస్తుంది. ఆ డబ్బులు వస్తేనే మందులు కొని, ఇంటిని వెళ్ల దీసేది. గతంలో ప్రతీ నెల ఒకటో తారీఖును వచ్చే పెన్షన్ ఇప్పుడు రెండో వారం వరకు రావడం లేదు. ఫలితంగా ఇబ్బందులు పడుతుంది. ।

'సుమారు నాలుగు దశాబ్దాల కాలం నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేసి 2017లో రిటైర్డ్ అయ్యాడు. ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రాట్యూటీ తదితరాలతో ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు పెళ్లిళ్లు, చదువులకు సరిపోయింది. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తే ఏం లాభం. రిటైర్డ్ వయస్సు వరకు సొంతిల్లు కూడా కొనలేని పరిస్థితి ఉంది. అద్దె ఇంట్లో నివసిస్తుంటే ప్రతీ నెల కిరాయి చెల్లించేది మొదటి తారీఖున పెన్షన్ పడటం లేదు.'



సిరిసిల్లలో పెన్షనర్ల నిరసన

- జీతం కోసం పండుటాకుల విలవిల
- ఒకటో తేదీన అందని పెన్షన్ డబ్బులు
- పీఆర్సీలు ఇవ్వడంలో తాత్సారంపై నిరసన
- ఆందోళనలో జిల్లా పెన్షనర్లు

సిరిసిల్లటౌన్: వారంతా మూడున్నర దశాబ్దాల పాటు ప్రభుత్వ శాఖలో పనిచేశారు. వృద్ధాప్యంతో రిటైర్‌మెంట్ పొంది విశ్రాంత ఉద్యోగులుగా ఉంటున్నారు. ప్రభుత్వం ప్రతీ నెల పెన్షన్ డబ్బులు మొదటి తారీఖున వేయడం లేదు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతీ నెల నిర్ణీత సమయంలో పెన్షన్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చెప్పుకోలేని పరిస్థితులతో జీవితాలు వెల్లదీస్తున్నారు. జిల్లాలో ప్రతినెల పెన్షన్ల కోసం టెన్షన్ పడుతున్న పండుటాకులపై ప్రత్యేక కథనం.

జిల్లాలో 3,715 మంది పెన్షనర్లు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారు, ఫ్యామిలీ పెన్షనర్లు మొత్తంగా 3,715 మంది ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ డబ్బులపై ఆధార పడి జీవిస్తున్నారు. చాలా ఏళ్లుగా పెన్షన్లు నిర్ణీత తేదీకి రావడం లేదు. గతంలో ప్రతీ నెల ఒకటో తేదీన జమయ్యేవి. కిరాణం, మందులు, ఇతర అవసరాలకు పెన్షన్ డబ్బులను ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకునే వారు. కొందరు పెన్షనర్లు తమ జీతంపై అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకులు, ఇతర సంస్థలలో రుణాలు పొంది ఉన్నారు. ప్రతీ నెల మొదటి వారంలో కిస్తీలు చెల్లించాల్సి ఉండగా.. జీతాలు ఒకటో తేదీన పడకపోవడంతో రుణదాతల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెన్షనర్లకు కూడా ప్రభుత్వం ఈహెచ్‌ఎస్ కార్డులు అందివ్వగా.. అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్ వైద్యం చేయించుకునే వారు. ప్రభుత్వం ఆస్పత్రులకు ఈహెచ్‌ఎస్ ద్వారా చికిత్స పొందిన వారి డబ్బులను చెల్లించకపోవడంతో పెన్షనర్లు నగదు పెట్టి చికిత్స చేయించుకుంటున్నారు. నగదు పెట్టి చికిత్స చేయించుకున్న వారికి రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశం ఉండగా.. నిధులు లేక ఏళ్లుగా బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు.

పెన్షనర్ల డిమాండ్లు ఇవీ..

- ప్రతీ నెల మొదటి తేదీన పెన్షన్ అందివ్వాలి.
- పెండింగ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి గతంలో మాదిరిగానే ఈహెచ్‌ఎస్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందివ్వాలి.
- కేంద్రం మంజూరి చేసిన మూడు డీఏలను వెంటనే అందివ్వాలి. పీఆర్సీ కమిటీని వేసి 2023 జూన్ వరకు పీఆర్సీ డబ్బులు చెల్లించాలి.
- గతంలో మాదిరిగా బస్సు చార్జీల్లో 40 శాతం రాయితీ కల్పించాలి.
- చనిపోయిన పెన్షనర్‌కు అదే రోజు దహన సంస్కారాల నిమిత్తం ఖర్చులను అందివ్వాలి.

పెన్షన్ కమ్యూనిలేషన్ పీరియడ్ కుదించాలి



రిటైర్డ్ అయ్యేప్పుడు 40 శాతం పెన్షన్‌ను ప్రభుత్వానికి అమ్ముకుంటారు. ఈ మొత్తం పదేళ్ల వరకే పూర్తవుతుంది. కానీ పదిహేనేళ్ల వరకు పెన్షన్ నుంచి కట్ చేస్తున్నారు. గుజరాత్ ప్రభుత్వం మాదిరిగా కమ్యూనిలేషన్ పీరియడ్‌ను 12 ఏళ్లకు తగ్గించాలి. పెన్షనర్ల హక్కులపై పోరాడుతాం. – బలరాం, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అవసరాలను అర్థం చేసుకోవాలి



పెరిగిన పెన్షన్ డబ్బులను గతంలో లేని విధంగా కిస్తీల ద్వారా అందిస్తున్నారు. అత్యవసరంగా ఖర్చులు చేసుకునేందుకు వీలుగా ప్రతీ నెల మొదటి తేదీనే పెన్షన్లు ఇవ్వాలి. ఆదాయం పన్ను నుంచి పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలి.
– చౌకి సుధాకర్, సంఘం ప్రధాన కార్యదర్శి

- తక్కువ మొత్తంలో పెన్షన్ పొందుతున్న వారికి ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి.
- రిటైర్డ్ అయిన రోజే వారికి వచ్చే గ్రాట్యూటీతోపాటు అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలి.

నూతన పాలకవర్గానికి సన్మానం



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: ఇటీవల ఎన్నికైన సిరిసిల్ల చేనేత వస్త్రవ్యాపార సంఘం నూతన పాలకవర్గాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి గురువారం సన్మానించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, సహాయ కార్యదర్శి సాప గణేశ్, కోశాధికారి విష్ణు ఉన్నారు.

బురుజులకు కొత్త శోభ



నామాపూర్‌లో నిజాం కాలంనాటి బురుజు

ముస్తాబాద్ (సిరిసిల్ల) : తెలంగాణలో పల్లెల్లో రాతి కట్టడాలతో బురుజులు నిర్మించి రజాకార్లను ఎదుర్కొన్న ఘటనలు అనేకం. అలాంటి చారిత్రక కట్టడాలు నేడు శిథిలమవుతున్నాయి. మండలంలోని మొర్రాయిపల్లె, నామాపూర్‌లోని బురుజులను కాపాడుకునేందుకు రెండు గ్రామాల ప్రజలు నడుం బిగించారు. పంచాయతీల సహకారంతో బురుజులను మరమ్మతులు చేసి రంగులు వేశారు. భవిష్యత్ తరాలకు గత చరిత్ర ఆనవాళ్లను అందించే బృహత్తర పనులను చేశారు.

ప్రధానాలయాల్లో ఉన్నతాధికారుల విచారణ

- రాజన్న ఆలయంలో అడిషనల్ కమిషనర్ విచారణతో ఉద్యోగుల్లో ఆందోళన

వేములవాడ : రాష్ట్ర దేవాదాయశాఖ పరిధిలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి దేవాలయాల్లో ఉద్యోగుల పనితీరు, రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాలు పాటిస్తున్నారా..? లేదా ..? అనే అంశాలపై ముగ్గురు ఉన్నతాధికారులు కమిషనర్ అనిల్‌కుమార్, అడిషనల్ కమిషనర్లు కృష్ణవేణి, కూరాకుల జ్యోతిని నియమించారు. దీంతో కొండగట్టు, యాదగిరిగుట్ట ఆలయాలను కమిషనర్ అనిల్‌కుమార్, వేములవాడ, బాసర ఆలయాలను అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భద్రాచలం, కొమురవెల్లి దేవాలయాలను అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా వేములవాడ ఆలయాన్ని కృష్ణవేణి ఈనెల 26న విచారణ జరిపి, శాఖల వారీగా ఫైళ్లు తనిఖీ చేసి వెళ్లారు. దీంతో రాజన్న ఆలయ ఉద్యోగుల్లో ఆందోళనలు నెలకొంది.

అవినీతి ఆరోపణలపై ఆరా...

వేములవాడ రాజన్న ఆలయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఆరా తీసినట్లు తెలిసింది. గతంలో విజిలెన్స్ కేసులు, అవినీతికి పాల్పడిన అంశాలను మరోసారి ఆరాతీసి వాటిపై చర్యలకు కమిషనర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. పలువురు ఉద్యోగులు డూప్లికేట్ సర్టిఫికెట్లతో ప్రమోషన్లు పొందినట్లు ఫిర్యాదులు అందడంతో వాటిపై సైతం విచారణ జరిపినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ఉద్యోగుల బదిలీ.. నిలిపివేత!

వేములవాడ : వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగుల అంతర్గత బదిలీ వ్యవహారం 24 గంటల్లోపే నిలిచిపోయింది. 13 మంది ఉద్యోగులకు పరిపాలనా సౌలభ్యం కోసం ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఈనెల 25న బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఈ క్రమంలో కేవలం జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు, క్యాంటిన్ సప్లైయర్స్‌ని మాత్రమే బదిలీ చేయడంతో సదరు ఉద్యోగులంతా తమతమ స్థానాల్లో రిలీవ్ అయ్యేందుకు నిరాకరించారు. ఓ దశలో ఉన్నతాధికారులపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. కిందిస్థాయి ఉద్యోగులకు మాత్రమే బదిలీలు చేస్తూ పైస్థాయి ఉద్యోగులను ఎందుకు బదిలీ చేయలేదంటూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఎందుకు అందలం పలుకుతున్నారంటూ బాహాటంగా విమర్శించారు. దీంతో ఆదేశాలు వెలువడిన 24 గంటల్లోపే బదిలీ ఉత్తర్వులు నిలిచిపోయాయి. మరికొంత మంది తమకు బదిలీ చేసిన స్థానాల్లో జాయిన్ అయ్యేందుకు వెళ్లడంతో ఆశాఖ ఉన్నతాధికారులు అక్కడ విధులు నిర్వహించే వారిని రిలీవ్ కావద్దంటూ ఆదేశించినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

పంపకాల కోసమేనా..?

ఆయాశాఖల ఉద్యోగులు తమతమ విధులు నిర్వహించుకుంటున్న క్రమంలో ఉన్నతాధికారులకు నెలనెలా మామూళ్లు అందజేస్తూ పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో 13 మంది తమ కిందిస్థాయి ఉద్యోగులకు ఈవో బదిలీ చేయడంతో అంతర్గతంగా వారి బదిలీలను నిలిపివేసినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల అర్బన్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం తంగళ్లపల్లి మండలం.. నేరెళ్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులెవరూ బాధపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు రైస్ మిల్లుకు తరలించాలని, నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండలంలోని సప్తగిరి రైస్‌మిల్లును తనిఖీ చేశారు. రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని రైస్ మిల్లర్ల యజమానులకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్, ప్యాక్స్ చైర్మన్ కొడూరి భాస్కర్, పలు శాఖల అధికారులున్నారు.

సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకోవాలి

సిరిసిల్ల అర్బన్: రైస్ మిల్లర్లు సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు లారీలు అందుబాటులో ఉండేవిధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్యాక్స్ చైర్మన్లు బాపురావు, బండి దేవదాస్ గౌడ్, కోడూరి భాస్కర్ గౌడ్, తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట : అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తడిసిన ధాన్యంతో ఇబ్బందులు పడుతున్నారని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, రాజు, దేవయ్య, బుచ్చాగౌడ్, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేలు పరిహారం అందించాలి

వీర్నపల్లి : అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉమ్మడి మద్దిమల్ల కంచర్ల, రంగంపేట, వన్‌పల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఎంతోరైతులు పంట నష్టంతో ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు వెంటనే అందజేయాలన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థికసాయం..

వీర్నపల్లికి చెందిన మునిగె రాజం, వన్‌పల్లి గ్రామానికి నాయుడు గంగారాంలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఒక్కో కుటుంబానికి రూ.2వేలు, 25 కిలోల బియ్యాన్ని ఆర్థికసాయంగా అందజేశారు. మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి, నాయకులు మల్లేశం, మహేశ్, తిరుపతి, వేణు, లక్పతి, పీర్యా, దేవరాజు, రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

- వెంకటాపూర్ కేంద్రంలో రైతుల నిరసన

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యంతో గురువారం రైతులు మొలకెత్తిన ధాన్యం చూపుతూ నిరసన తెలిపారు. మండలంలోని వెంకటాపూర్‌లో అకాలవర్షాలతో తడిసిన ధాన్యం అరబెట్టడం సాధ్యం కాదని, తడిసి రంగు మారిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని గురువారం డిమాండ్ చేశారు. రైతులకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి 20 రోజులవుతున్నా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతిరోజు ధాన్యం అరబెడుతున్న సాయంత్రం వరకు వర్షంతో తడిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..వడగండ్లతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. రైతులు బాలయ్య, రాజిరెడ్డి, రవి, రమేశ్, ఎల్లం తదితరులు ఉన్నారు.

తపాలా కార్యాలయాల్లో పింఛన్ డబ్బులు చెల్లింపులు


- ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై. వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వర్లు

చందుర్తి (వేములవాడ) : తపాలా శాఖ కార్యాలయాల్లో ఆసరా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించనున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి రుసుం లేకుండా ఉచిత సేవలను పెన్షనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం మార్చినెల పింఛన్ డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. పోస్టాఫీసుల్లో ఎలాంటి ఫీజు లేకుండా రూ.10వేల వరకు చెల్లిస్తామన్నారు. కరీంనగర్ డివిజన్ పరిధిలో గల అన్ని పోస్టాఫీసుల్లో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికుల ఆసరా పింఛన్ల డబ్బులు చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే పోస్టాఫీస్ సిబ్బంది పింఛన్ డబ్బులను చెల్లిస్తారని, ఒకవేళ వేలిముద్ర పడకపోతే, పంచాయతీ కార్యదర్శి వేలిముద్ర తీసుకొని చెల్లిస్తారన్నారు. కరీంనగర్ డివిజన్ పరిధిలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2 హెచ్‌వోలు, 52 సబ్ పోస్టాఫీసులు, 389 పోస్టాఫీసులు ఉన్నాయన్నారు.

ఆవు, దూడ మృతి



మృత్యువాతపడిన ఆవు, దూడ

కోనరావుపేట: మండలంలోని సుద్దాల ఊర చెరువులో నీటమునిగి ఆవు, దూడ మృతి చెందగా రైతుకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సుంకరి పర్శరాములుకు చెందిన ఆవు, దూడను సుంకరి భూమయ్య కడిగేందుకు చెరువులోకి తీసుకెళ్లాడు. తర్వాత బెదరడంతో చెరువులోకి పరుగెత్తాయి. వాటిని కడుగుతూ భూమయ్య కూడా నీటిలో పడిపోయాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే చెరువులోకి దిగి భూమయ్యను కాపాడారు. పశువులకున్న తాళ్లను కట్ చేశారు. కానీ అప్పటికే మృత్యువాతపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ నాయకులు ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మునిగెల రాజు మాట్లాడుతూ.. ఓ వైపు అకాల వర్షాలతో రైతులు ఆగమవుతుంటే అధికార పార్టీ నాయకులు ఆత్మీయ సమ్మేళనాల పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇక్కడ సోషల్ మీడియా ఇన్‌చార్జి గడ్డం మధుకర్, గుగ్గిళ్ల భరత్, బాలసాని శ్రీనివాస్, బాలు, అభినయ్, శ్రీను, యోగి, శ్యామ్, శ్రీను, విజయ్, తదితరులున్నారు.



కోనరావుపేటలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

బో'నమో' పోచమ్మ



తిప్పాపూర్‌లో..



చందుర్తి : ఎన్గల్‌లో..

వేములవాడ అర్బన్/ చందుర్తి/ కోనరావుపేట : చందుర్తి, వేములవాడ అర్బన్, కోనరావుపేట మండలాల్లో పోచమ్మ బోనాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవుల కులదైవమైన చౌడాలమ్మ పండుగలో భాగంగా గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. చందుర్తి మండలం ... ఎన్గల్‌లో ఆర్యక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో, కోనరావుపేటలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు మధ్య భారీ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు